# మనస్తత్వాలు

సీతారామయ్యకి చిన్నప్పుడు చదువు అబ్బలేదు. అలాగని పెద్దయ్యాక తెలివితేటలూ అబ్బలేదు.

పోనీ, గడుసుదనం, మాటకారితనం ఇవేవైనా ఉన్నాయేమో వీటితోనైనా లోకంలో నెగ్గుకొస్తాడనుకుంటే... అబ్బే... వాటికీ అతనికీ సహం ఎరిక!

ఇవేవీ లేకపోతే పీడా పోయిరి! చేతినిండా డబ్బూ, సంఘంలో పలుకుబడీ కనక పుష్కలంగా ఉంటే. ఓ, దివ్యంగా బతికేసెయ్యవచ్చు అందామా, మొదటిదాన్ని వాళ్ళ నాన్నా, రెండో సదుపాయాన్ని వాళ్ళమ్మా విచ్చలవిడిగా ఖర్చుపెట్టేసి, ఇహ సీతారామయ్యకి తలదాచుకునేందుకు ఆకు తెగిరిపోయిన ఓ ఒంటి నిట్టాడు పూరిపాకా తిండి లేనప్పుడు నీరసంగా పడి ఉండటానికి తాళ్ళు తెగిపోయిన ఓ నులకమంచం, నూకలంటూ ఉంటే ఉడకేసుకోడానికి ఉపయోగించని రెండు బోళ్ళ గిన్నెలూ, "హరి!

పీడా ?...ఆ గంపగయ్యాళి నాగమ్మ కొడుకా ?" అనే ఈసడింపు వాక్యాలూ— ఇవి మాత్రం మిగిల్చి, "ఊ... వీటితో ఎలా బతుకుతావో బతుకు" అంటూ వాళ్ళ బ్రతుకుల్ని మాత్రం ఎవరిదారిన వాళ్ళు తెల్లవార్చేసుకున్నారు.

—ఇహపోతే వాళ్ళ ధర్మమా అని సీతారావయ్యకి దఖలుపడ్డ వారసత్వం అల్లా నల్లగా గంట్లుతేరిన తండ్రి అనాకారి రూపమూ, పిడిరాయిలా చెక్కు చెదరని ఒకటో రకమైన తల్లి ఆరోగ్య భాగ్యమూను.

ఆరోగ్యంలోను మళ్ళీ అల్లాంటి ఇల్లాంటి ఆరోగ్యం కాదు. పుష్టిగా కండలు తిరిగిన వస్తాదుకి ఉండే శరీర సౌష్టవంతో కూడిన ఆరోగ్యం. నిజానికి అతను ఏ మల్లయుద్ధ వీరుడులాగో ఉండవలసింది తిండి పుష్టికనక సరిగ్గా ఉంటే. కాని సీతారావయ్యకి ఆ అదృష్టమే లేదు. ఆ పేటలో ఎవరింట్లోనో అభమో శుభమో అయి సీతారావయ్యని భోజనానికి పిలిస్తేనేకాని లేకపోతే వారానికి రెండుమూడు రోజులు అతనికి ఏకాశిలే!

అయినా ఫరవాలేదు. వారంలో తగితే ఆ నాలుగైదు భోజనాలే చాలు. అతని శరీరాన్ని ఓ చక్కని పరిమాణంలో ఉంచి నిరాహార దీక్షలో వున్న వస్తాదులా లోకానికి ప్రదర్శించడానికి లోకం దృష్టికి అలా బలశాలిగా కనిపిస్తాడు కనకనే, వీధిలో ఎవరు ఏ బరువు ఎత్తుకోవలసి వచ్చినా ఏ ఇల్లాలు ఇంట్లో ఉన్న రాతిరోళ్ళూ, రుబ్బురోళ్ళూ వంటి దెయ్యపు సామానులు ఇటునుంచి అటూ, అటునుంచి ఇటూ మార్పించవలసి వచ్చినా, చటుక్కున సీతారావయ్యని

కేకెయ్యడం అతను వెంటనే వెళ్ళి వాళ్ళకా సాయంచేసి పెట్టడం ఓ రివాజయి పోయింది.

ఇలా పదిమంది అవసరాలకీ ఆదుకుంటూ అందరికీ తలలో నాలికలా ఉండడానికి సీతారావయ్య ఆరోగ్యం ఉపయోగపడితే, పనిలేని ప్రతివ్యక్తి నాలికా ఇవతలకి వచ్చి అల్లల్లాడడానికి అతని అవకర రూపం కారణం అయింది. ఏం తోచకపోతే ఎవరో ఒకరు పెద్దపని ఉన్నట్టు సీతారావయ్యకి కబురు చెయ్యడం కబుర్లలోకి దింపడం, అతని అవకతవక వాగుడికీ, అనాకారి రూపానికీ విరగబడి నవ్వుతూ అతన్ని వేళాకోళం పట్టిస్తూ ఆనందించడం. ఇలా ఆనందించేది ఆ పేటలో వున్న ఒక్క మగవాళ్ళే కాదు. అశేషమైన ఆడజనం అంతాను.

అయితే, ఎప్పుడూ సీతారావయ్య గొడవ పట్టించుకోకుండా, ఒక వేళ మాటల సందర్భంలో అతని ప్రసక్తి వచ్చినా, 'ఆ సన్యాసి గొడవ ఎత్తకండి' అంటూ చీదరించుకుంటూ ఉదాసీనంగా ఉండే వ్యక్తులు కూడా ఒకళ్ళిద్దరు లేకపోలేదు ఆ పేటలో.

అందులో ముఖ్యమైంది కాంతమ్మ.

కాంతమ్మకి అలాంటి వేళాకోళాలూ, వెకిలి పనులూ, వెఱ్ఱి వేషాలూ అంటే మహాచెడ్డ చిరాకు, అనాకారులన్నా, అవకతవక మనుష్యులన్నా వళ్ళు మంట. మనుష్యులు శుభ్రంగా హుందాగా దర్జాగా ఉండాలి కాని పెడనవ్వులు

నవ్వుతూ లేకిపనులూ లేకి మాటలతో తేలికగా జీవించ రాదు అనే తత్వం ఆమెది.

తను అల్లాగే ఉంది. ఉంటోంది కూడా

— తన పద్ధెనిమిదో ఏట పిల్లలులేని ఏభైయేళ్ళ పక్షవాతం రోగికి మూడో భార్యగా ఆ ఇంట్లో ఏం అడుగు పెట్టిందో ఏమో. అంతే—మళ్ళీ ఆ ఇంట్లోమాట ఒక్కటి బైటకి రాకుండా భర్త పోయేదాకా ఈ పదేళ్ళూ గుట్టుగా కాపురం చేసింది.

"ఆ రోగిష్టి మొగుడితో ఏం సుఖపడుతోంది!"

"వాడికి సేవ చేసింది చేసినట్టుంటోంది"

"చిన్నదైనా కాంతమ్మ పెద్ద లెక్కల్లో మనిషి"

"పతివ్రత!"

ఇలా పైవాళ్ళు జాలిపడ్డమే కాని ఆమె నోటివెంట ఒక్క మాటకూడా బైటికిరాలేదు. భర్త ఉన్నప్పుడే కాదు పోయిన తరువాత ఈ రెండేళ్ళనుంచీ కూడా పరాయివాణ్ణి కన్నెత్తి చూడడం కానీ పన్నెత్తి పలకరించడం కానీ చెయ్యలేదు. అంతగా ఆస్థి వ్యవహారాలకి సంబంధించి (భర్త తాలూకు ఆస్థి పదెకరాల మాగాణీ పల్లెలోనూ, ఇప్పుడుంటూన్న ఇల్లు కాక నెలకు రెండువందలు అద్దె వచ్చే ఇళ్ళు పట్నంలోనూ ఉన్నాయిలెండి) ఏ మగవాడితో నయినా అవసరంఅయి మాట్లాడవలసి వచ్చినా, చక్కగా కచ్చాబోసి కట్టుకున్న చీరకొంగు నిండుగా రెండు బుజాల

మీదకి కప్పుకొని తలుపు వెనకాలనుంచుని మెల్లగా పెదవి కదల్చడమే !

నెమ్మదిగా మాట్లాడడమే కాని ఎప్పుడూ గట్టిగా ఏమీ అనడంగాని, గలగలా నవ్వడంకాని ఎరగని కాంతమ్మ యొక్క సాత్త్వికమైన ప్రకృతి స్వతహాగ ఆమెకి ఉన్న అందాన్ని పదిరెట్లు చేసేది. అందుకే పచ్చని ముఖంమీద పడుతున్న నల్లని ఒంకీల జుట్టుని వెనక్కి దువ్వుకొని జారుముడి వేసుకున్న కాంతమ్మ నిండైన రూపాన్ని చూసిన వాళ్లు అంతా "ఈ కుందనపు బొమ్మకి బొట్టు ఒక్కటి లేదు కాని లేకపోతే సాక్షాత్తూ లక్ష్మి కదూ?" అనేవాళ్ళు.

ఇలా వయస్సూ, అందం. ఆస్తీ అన్నీ ఉండి కూడా ఆమె ఎప్పుడూ విరగబాటు జీవితాన్ని గడప లేదు, ఇతరులను హేళనచేసే ప్రకృతిని అలవరచుకోనూ లేదు. అందుకే అందరితో బాటూ కాంతమ్మ కూడా కలసి సీతారావయ్యని వెళాకోళం చెయ్యకపోవడం. అంతేకాదు రోజూ తనఅరుగు మీదకి చేరే ఆడవాళ్ళతో కబుర్లు చెప్పే సందర్భంలో ఎప్పుడేనా అతని ప్రసక్తి వచ్చినా 'పోనిద్దూ అతని సంగతి మనకెందుకు ?" అన్నట్లు మొహం చిట్లించి మాట మార్చేది. దాంతో తోటి అడవాళ్ళు కూడా, లోపల సీతారావయ్య గురించి చెప్పుకుని వినోదించాలని ఎంత ఉన్నా పైకి అతని సంగతి ప్రస్తావించకుండా ఊరుకొనేవారు. అంతేకాదు. కాంతమ్మ మెప్పుకోసం అతని అనాకారి రూపాన్నీ, అయోమూఢం ప్రవర్తననీ అప్పుడప్పుడు చీదరించుకొనేవారు కూడా ఆ విధంగా చీదరించుకుంటూ ఆమెతో పాటు తాము కూడా అసహ్యాన్ని అతనిపట్ల ప్రదర్శిస్తే ఆమె దగ్గర్నుంచి ఏ

వక్క పలుకో, గుక్కెడు కాఫీనీళ్ళో, ఓ పావలా చేబదులో సంపాదించ వచ్చునని వాళ్ళ ఆశ!

అలా ఆస్తీ, అందం, మంచితనం అన్నీ ఉండి, ముద్దినుసు సరుకులూ అమారుగా ఇంట్లో సిద్ధంచేసి పెట్టుకొని అప్పుడప్పుడు కొద్దో గొప్పో విదిల్చే కాంతమ్మ మెప్పు సంపాదించడం కోసమనీ, కాలక్షేపం కొరకు కబుర్లు చెప్పుకోవడం కోసమనీ, ఆ పేటవాళ్ళలో సగానికి సగం ఆమె అరుగు మీాదకి చేరుతారు మధ్యాహ్నం అయేసరికి—

తమలపాకు చిలకల్నీ, తలపాగా కండువాలనీ భర్తలకి అందించి వాళ్ళని ఆఫీసులకి సాగనంపేక, రోజూలాగే ఆ రోజుకూడా పేటలో ఆడవాళ్ళు గబగబా రెండు మెతుకులు నోట్లో వేసుకొని కాంతమ్మ అరుగుమీాదకి చేరారు కబుర్ల కోసమని—

కాని ఆ రోజున ఏమిటో కాంతమ్మ ఇంకా తలుపు తీసుకుని ఇవతలకి రాలేదు. ఏం చెప్మా అని కాస్సేపు తర్జన భర్జన చేసి చివరికి "భోజనం చేసి కాస్సేపు నడుం వాల్చి ఉంటుంది" అని తీర్మానం చేశారు వాళ్ళంతా. తిరిగి వెళ్ళిపోవడంకంటే ఆమె లేచేదాకా ఆ అరుగు మీాదే కాలక్షేపం చెయ్యడానికి నిర్ణయం చేసుకుని సీతారావమ్మని రప్పించి కబుర్లు చెప్పిస్తేనో-అనుకున్నారు.

"కాంతమ్మగారి అరుగుమీాదికి సీతారావమ్మని రప్పించడమే! అని భయంతో కొంతసేపు తటపటాయించారు ఇంతలో లోపల ఏమీా అలికిడి లేకపోవడంతో, కాంతమ్మ ఏ పెరటి గదిలోనో గాఢనిద్రపోతూ ఉండి

ఉంటుందని నిర్ధారణ చేసుకుని, "సీతారావయ్యకి కబురు చేసి రప్పించి ఓ గంట వాగించి పంపిస్తే ఆమె ఏం మూడోచ్చిదీ?" అంది ఓ ఇల్లాలు. "సరే. అయితే నువ్వే వెళ్ళి పిల్చుకురా!" అని ఆమెనే పురమాయించారు తక్కిన వాళ్ళంతా.

పాకలో నులక మంచంమీద బద్ధంగా పడుకొని నడి కొప్పులోంచి టార్చిలైటుల్లా చిత్రంగా లోపల పడుతూన్న సూర్యకాంతి మార్గాల్ని తమాషాగా చూస్తున్నవాడల్లా వచ్చి కాంతమ్మ అరుగుమీద నీరసంగా చదిగిలబడ్డాడు సీతారావయ్య ఆ పిలుపుతో.

"ఏం సీతారావయ్యా! ఇవాళ కందా ఎవరింట్లో?" అని అడిగింది ఒకావిడ.

"కందా?... అంటే...!" గుడ్లు మిటకరించాడు సీతారావయ్య.

"అదేనయ్యా భోజనం"

"భోజనమా?...ఎక్కడా లేదు" నీరసంగా అన్నాడు సీతారావయ్య.

లోపల పడతమంచం కిర్రుమంది.

కాంతమ్మ నిద్దట్లో ఇటునుంచి అటుదొర్లింది కాబోలు!

"అవునయ్యా! రోజూ ఎవరు పెడతారు? అంత బలమైన మనిషివి, రాయితన్నితే పదిముక్కలవుతుంది. ఏదో పని చేసుకుని బతకకూడదూ? వీళ్ళమీదా వాళ్ళమీద ఆధారపడకపోతే!" అంది ఓ ఇల్లాలు.

"ఏనా ?...హు!(... దానికెన్ని తెలివి తేటలు కావాలి!...ఏం?... ఏమంటావు సీతారామయ్యా?" అంది ఇంకో స్త్రీ.

"నిజమే మరి!" అన్నాడు సీతారామయ్య బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ.

అదివిన్న ఆడవాళ్ళంతా ఘొల్లున నవ్వారు. ఆ నవ్వులో కాంతమ్మ వేళ్ళు విరుచుకుంటున్న చప్పుడు వినిపించనే లేదు వాళ్ళకి.

"పోనీ ఓ పని చెయ్యకూడదూ ?" అంది ఒక పడతి అతి సీరియస్‌గా.

"ఏమిటి ?" అన్నాడు సీతారామయ్య ఆశగా ఆమె కేసి చూస్తూ.

వెంటనే వెక్కిరిస్తున్నట్లు "పె...ళ్ళి.." అంది ఆ రెండు అక్షరాలనీ ఊని పలుకుతూ.

అంతా మళ్ళీ నవ్వులకి పడ్డారు.

తన పెళ్ళినాటి మధురానుభవం గుర్తుకువచ్చి కాంతమ్మ దీర్ఘంగా వదిలిన నిట్టూర్పు శబ్దం అరుగుమీద ఉన్నవాళ్ళ చెవులదాకా రానేలేదు.

నవ్వు ఆపుకుంటూ "అవును నిజమే. తెలివైన పిల్లని పెళ్ళాడితే ఆమె అయినా సంపాదించి ఇంత అన్నం పెడుతుంది మన సీతారామయ్యకి" అంది ఒక గడుసు యువతి.

"మరే పాపం. రంభల్లాంటి ఆడపిల్లలంతా ఇప్పుడక్కడ పడిగాపులు పడి కూర్చున్నారు, ఇంకా సీతా

రావయ్యా వచ్చి తమని పెళ్ళాడ లేదేమో అని" అంది అందులో కొంచెం అందమైన అమ్మాయి.

వచ్చే నవ్వు ఆపుకుంటూ "ఇంతకీ సీతారావయ్యా! నీ కెలాంటి అమ్మాయి కావాలి? నాలాగ ఉంటే చాలా?" అంది నడివయస్సు దాటిన ఓ గృహిణి.

"పోనీ నాలాంటిదయితే!" అంది ఇంకో జుట్టు నెరిసిన ముత్తైదువ.

ఇంతలో "ఉండండర్రా అతన్ని ఎన్నుకోనీయండి, చూడు సీతారావయ్యా! నీకు కాబోయే భార్య మాలో ఎవరిలా ఉండాలి?" అంది ఓ చంటిపిల్లాడిని ఎత్తుకున్న తల్లి.

సీతారావయ్య బిత్తర చూపులు చూస్తూ కూర్చున్నాడు.

"అమగోనర్రా... పాపం చూసుకుంటున్నాడు ... ఊ! చెప్పు సీతారావయ్యా నీ భార్య నాలా ఉండాలా, వనజాక్షిలా ఉండాలా, సరళలా ఉండాలా, చంద్రకళలా ఉండాలా, సుభాషిణిలా ఉండాలా, సుబ్బమ్మత్తలా ఉండాలా లేక కాంతమ్మ వదినలా ఉండాలా?" అని అడిగింది ఓ పాతికేళ్ళ పడుచు.

అంతా పకపకా నవ్వేశారు.

అసలే ప్రొద్దుటినుంచీ అన్నంలేక ఆకలితో నీరసంగా ఉన్న సీతాగావయ్యకి వాళ్ళ మాటలు ఏదో చెప్పలేని మరో కొత్త ఆకలిని కల్పించడంతో, తనలో రేగిన అవ్యక్తమైన ఆ బాధని అణచుకోలేక నిస్సహాయంగా గోడకి జార్లాబడి కళ్ళు మూసుకున్నాడు.

అతన్ని చూసి ఆడవాళ్ళంతా ఇంకా నవ్వారు. వాళ్ళు అలా ఎంతసేపు నవ్వుతూ ఉందురో, ఇంతలో తలుపు తీసుకుని కాంతమ్మ అరుగుమీాదకి వచ్చింది. ఆమెని చూసి వాళ్ళు కలవరపడి చట్టున నవ్వు ఆపుచేశారు. కాని అప్పటికే ఆమె కళ్లు నవ్వుతూన్న ఆ మహిళా మండలినీ, అటు నీరసంగానూ నిస్సహాయంగానూ కళ్లు మూసుకొని గోడకి జేర్లాబడి కూర్చున్న సీతారావయ్యనీ సమీాక్ష చేశేశాయి.

సీతారావయ్యని తన అరుగుమీాదకి రప్పించి వాగిస్తున్నందుకు కాంతమ్మ ఎక్కడ ఆగ్రహిస్తుందో అనే తొట్రుపాటుతో గుటకలు మింగుతూన్న ఆ స్త్రీ జనం, కాంతమ్మ తలపంకించడాన్ని గమనించనే లేదు.

అందులో ఒక ముత్తైదువ "ఊ... సీతారావయ్యా ఇంక వెళ్ళిరా" అంది కాంతమ్మకి కోపం మరీ హెచ్చిపోకుండానే అతణ్ణి అక్కడనుంచి పంపించెయ్యడం మంచిదనే ఉద్దేశంతో.

సీతారావయ్య ఒక్కమారు కాంతమ్మకేసి బెదురుతూచూసి అరుగు దిగబోతున్నాడు. ఇంతలో "ఆగు సీతారావయ్యా" అంది కాంతమ్మ తన సహజమైన సౌజన్య కంఠంతో. ఒక కాలు కిందకి దింపిన వాడల్లా ఆ మట్టునే ఆగిపోయాడు. అతణ్ణీ తమనీ కలిసి ఆమె ఏం చివాట్లు పెడుతుందోరా భగవంతుడా అనుకుంటూ ఆ ఆడవాళ్ళంతా చితుకూ చితుకూమని చూస్తూ కూచున్నారు. ఓ మారు వాళ్ళనీ మరోమారు సీతారావయ్యనీ నిశితంగా పరిశీలించి "ఊఁ!" అంది దీర్ఘంగా కాంతమ్మ.

సీతారావయ్య ఆమెకేసి జాలిగా చూశాడు.

"అలా నీరసంగా ఉన్నావేం? ఇవాళ భోజనం చెయ్యలేదా ?" అంది కాంతమ్మ.

సీతారావయ్య తల అడ్డంగా ఊపాడు.

"నేను పెడతాను. తింటావా ? ఈ పూటల అన్నం అంతా ఆ మట్టునే ఉండిపోయింది" అంది.

కాంతమ్మ మాటలు విని అంతా ఆశ్చర్యపోయారు.

"ఆమె నిజంగా అడుగుతోందా లేక వేళాకోళం గానా" అన్న అనుమానంతో సీతారావయ్య ఆమె ముఖం లోకి చూశాడు.

కాంతమ్మ చిరునవ్వుతో "ఏం అలా అనుమానిస్తావేం? మా ఇంట్లో భోజనం నీకు పనికిరాదా ?" అంది.

వెంటనే వయసుమళ్ళిన ఓ మహిళ కల్పించుకుంటూ "మాట్లాడవేం సీతారావయ్యా ? కాంతమ్మగారలా అడుగుతూ ఉంటే ?...ఊ...అను" అంది మెప్పుకోసం కాంతమ్మ కేసి చూస్తూ.

కాంతమ్మ ఒక్క ఆమెనే కాదు, మొత్తం అక్కడున్న ఆడవాళ్ళ నెవర్నీ గమనించనట్టు అటు తిరిగి సీతారావయ్య వైపే తదేక దృష్టితో చూస్తూ నిలబడి ఉంది.

సీతారావయ్య ఏం చెప్పడానికీ తటపటాయిస్తున్నాడు.

ఇంతలో ఇంకో యువతి "ఏమిటి ఆలోచన సీతారావయ్యా !? అంది గంభీరంగా.

వెంటనే కంగారుపడుతూ సీతారావయ్య "అబ్బే ఏం లేదు... అలాగే..." అంటూ లేచి బద్ధకంగా రెండు చేతులూ పైకి జాపి ఒళ్ళు విరుచుకున్నాడు. అలా విరుచు కుంటున్నప్పుడు కండలు తిరిగిన అతని దృఢ శరీరాన్ని కళ్ళ నిండుగా చూస్తూ ఆమట్టునే నిలబడి ఉండిపోయింది కాంతమ్మ.

"పాపం. ప్రొద్దుటినుంచీ భోజనం లేదుట! నీ పుణ్యమా అని..." అంటూ ఇంకా మాట్లాడుతూనే ఉన్న ఓ తల నెరిసిన ఆమె వాక్యం పూర్తి కాకుండానే కాంతమ్మ సీతా రావయ్యని తీసుకుని లోపలికి వెళ్ళి తలుపు గడియ వేసేసింది. అంతమందీ అక్కడ అరుగుమీద కూర్చుని ఉన్నారు అనే ధ్యాసే అసలు లేనట్టు.

కాంతమ్మ తమతో ఒక్కమాటైనా మాట్లాడక పోవడం, ఎప్పుడూ లేంది సీతారావయ్యమీద అంత ఆదరణ చూపించడం అన్నింటికంటే మించి తామంతా అరుగుమీద కూర్చుని ఉన్నాం అని అయినా ఏం లెక్క చెయ్యకుండా తలుపు గడియ వేసేసి సీతారావయ్యని తీసుకుని లోపలికి వెళ్ళిపోవడం. ఇదంతా చూసి విస్తుపోయి గుడ్లప్పగించి చూస్తూ అలా కూర్చుండి పోయారు ఆ స్త్రీ జనం అంతా. కొంతసేపటికి ఒకొక్కళ్ళే నెమ్మదిగా వెళ్ళిపోయారు ఎవరిదారిన వాళ్ళు.

ఆ వెళ్ళిపోవడం వెళ్ళిపోవడం మళ్ళీ ఒక్క అమ్మ లక్క కాంతమ్మ అరుగు ఎక్కితే ఒట్టు. మర్నాడు మధ్యాహ్నం మకాం మార్చారు ఇంకోళ్ళ అరుగుమీదకి.

"రామ! రామ! కలికాలం ఎలా తగలబడి పోయింది," అంది ఒకామె.

"ఎలా ఉండేది కాంతమ్మ! నిప్పులాంటిది ఒకప్పుడు. ఇప్పుడు?...హువ్వ్" అంది మరొక యువతి.

సిగ్గు లేకపోతే సరి! మరీ అంత దుమ్ములు మెడకి కట్టుకుని తిరగడమా?" అంది ఇంకో పతివ్రత.

"ఏమైనా సీతారామయ్య కోటలో పాగా వేశాడు" అంది మరో మహిళ.

ఇలా నలుగురూ అనుకునే మాటలు కాంతమ్మ చెవుల్లో కాని సీతారామయ్య చెవుల్లో కాని పడకపోలేదు. అయితే కాంతమ్మ తనకి సహజంగావున్న సహనాన్ని కోల్పోకుండా పూర్వంకంటె ఇంకా ఎక్కువ సాత్త్వికంగా ఉంటూ, కచ్చాపోసి కట్టుకున్న చీరకొంగు మరింత పెద్దదిగా తీసుకుని కొప్పుమీంచీ రెండుబుజాలమీంచీ ఇంకా నిండుగా కప్పుకుంటోంది.

చదువూ, తెలివితేటలూ ఏవీ లేని సీతారామయ్య కూడా కొంత గడుసుదనాన్ని నేర్చుకుని, ఎవరితోనూ విస్తారంగా మాట్లాడకుండా, ఎవరి ఇంటికీ భోజనానికి కూడా వెళ్ళడం కూడా మానుకున్నాడు.

ప్రజలంతా అనుకునే మాటలు వినడం అవి మనస్సుకి పట్టించుకోవడం అనవసరం అనుకుంది కాబోలు తరుచు కాంతమ్మ బయటికి రాకుండా ఇంట్లోనే ఉంటోంది.

అందుకే—

ఎప్పుడు చూచినా కాంతమ్మ ఇంటితలుపు లోపల గడియ వేసి ఉంటోంది.

ఏ సమయంలో పరిశీలించినా సీతారావయ్య వూరి వాకి తలుపు బయట గొళ్ళెం పెట్టే ఉంటోంది—